అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి

ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

పర్ణశాల, జనవరి 4 : జిల్లాలోని అర్హులందరికీ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాలు అందించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. గురువారం మండలంలోని నల్లబెల్లి పంచాయతీ గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారెంటీల పథకాలను అర్హులందరికీ వర్తింపజేయాలని అన్నారు. ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, గ్రామసభల్లో అధికారులకు దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసే వారు గ్యారెంటీల దరఖాస్తు ఫారంలో కొత్త రేషనర్ కార్డు కోసం అన్ని పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తెల్లం సీతమ్మ, ఎంపీపీ రేసు లక్ష్మీ, సర్పంచ్ జయమ్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అన్నెం సత్యనారాయణమూర్తి, మండల కార్యదర్శి కణితి రాముడు, కామేశ్ పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తాం..

ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరు టౌన్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

బూర్గంపాడు, జనవరి 4 : పార్టీలకతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తామని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని అంజనరాపురం పంచాయతీలో గ్రామసభను ప్రారంభించిన మాట్లాడారు. ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకే గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 6వ తేదీ వరకు గ్రామసభలు ఉంటాయని, అధికారులు ప్రజల వద్దకు వచ్చి దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మణుగూరులో...

మణుగూరు టౌన్, జనవరి 4 : ప్రజాపాలన గ్రామసభలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం పగిడేరు పంచాయతీ శాంతినగర్‌లో నిర్వహించిన గ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అర్హులందరూ దరఖాస్తులు అందజేసి ప్రభుత్వానికి సహకరించాలన్నారు. దరఖాస్తుల్లో డబ్బు వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. అనంతరం రామానుజవరం పంచాయతీ కొండాయిగూడెంలోని ముత్యాలమ్మగుడి వద్ద ఏర్పాటు చేసిన గ్రామస్తుల ఆత్మీయసమ్మేళన కార్యక్రమానికి హాజరయ్యారు.

మేడారం జాతరలో సేవాభావంతో విధులు నిర్వహించాలి

పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ రాష్ట్ర డైరెక్టర్ రవీందర్‌నాయక్

డైరెక్టర్‌కు చిత్రపటాన్ని అందిస్తున్న వైద్యాధికారులు

ములుగు రూరల్, జనవరి4: వచ్చే నెలలో ప్రారంభమయ్యే మేడారం సమ్మక్క-సారలమ్మల జాతరలో వైద్య సిబ్బంది సేవా భావంతో విధులు నిర్వహించాలని, భక్తులకు వేగవంతమైన సేవలు అందించి జాతరను విజయవంతం చేయాలని తెలంగాణ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ రాష్ట్ర డైరెక్టర్ రవీందర్‌నాయక్ అన్నారు. ములుగు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా , ములుగు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారారులకు, ప్రొగ్రా ఆఫీసర్లకు, ప్రాథమికి వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులతో సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది సేవా భవంతో మనస్ఫూర్తిగా నిస్వార్థమైన సేవలను భక్తులకు అందించాలని తెలిపారు. విధుల పట్ల నిబ్దదత కలిగి ఉండాలని ఆదేవించారు. జాతర సమయంలో విధుల్లో ఉండే సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ సమన్వయంతో సేవలు అందించాలని సూచించారు. అనంతరం రవీందర్‌నాయక్‌కు వైద్యాధిరానేలే మేడారం అమ్మవార్ల చిత్రపటాన్ని బహూకరించారు. సమావేశంలో ములుగు, వరంగల్ డీఎంహెచ్ఓలు డాక్టర్ అప్పయ్య, డాక్టర్ సాంబశివరావు, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

CHANGE OF NAME

* I, MOHAMMED AISHA BANU CHANGED MY NAME AS MOHAMMED AISHA BANO, W/o. MOHAMMED GAFFAR, R/o. H.NO. 39-1-76, Q.NO:BF-148, IM COLONY, KTPS, PALONCHA - 507115, BK.DIST.
KMM

FLAT FOR SALE

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9640400073/9160900024.
NT-319403-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

ప్రజాపాలన దరఖాస్తుల్లో అస్పష్టత

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- మీ సేవా కేంద్రాల వద్ద బారులు

కొత్తగూడెం అర్బన్: ప్రజాపాలనలో దరఖాస్తులు అందిస్తున్న ప్రజలు

పాల్వంచ: దరఖాస్తులు అందించేందుకు బారులుతీరిన పట్టణవాసులు

పాల్వంచ/ కొత్తగూడెం అర్బన్, జనవరి 4: ప్రజాపాలన పేరుతో రాష్ట్ర ప్రభుత్వం అభయహస్తం ఆరు గ్యారెంటీ పథకాల అమలు కోసం దరఖాస్తులను స్వీకరిస్తుండడంతో ఐదోరోజు కూడా జనాలు పోటెత్తారు. ఇంటి వద్దకే వచ్చి దరఖాస్తులు ఇస్తామని అధికారులు చెప్పినా కానీ కొంతమంది సిబ్బంది ఇవ్వకపోవడంతో ప్రజలు కేంద్రాల వద్దకు వచ్చి వాటిని పూర్తి చేయించుకొని బారులు తీరి మరి దరఖాస్తులు ఇవ్వాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వ అధికారులు ఏర్పాట్లు కూడా తూతూమంత్రంగా ఉండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

ఆధార్ అప్‌డేట్ కష్టాలు..

తెల్లవారుజాము నుంచే ఆధార్‌సెంటర్లు కిటకిటలాడుతున్నాయి. ఆధార్‌కార్డు పొంది పది సంవత్సరాలు పూర్తయినవారు అప్‌డేట్ చేసుకోవాలని కేంద్రం గతంలో ప్రకటించడం, ప్రస్తుత ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన దరఖాస్తు చేయాలంటే ఆధార్‌కార్డు అప్‌డేట్ అవసరమనే అపోహతో ఆధార్‌సెంటర్లకు పరుగులు పెడుతున్నారు. అయితే ప్రజాపాలన దరఖాస్తులకు కుల, ఆదాయ సర్టిఫికెట్లు అవసరం లేదని దరఖాస్తును నింపి అందజేస్తే సరిపోతుందని కలెక్టర్ చెప్పినప్పటికీ ప్రజలు ఇవేమీ పట్టించుకోకుండా ఆధార్‌సెంటర్లకు పరుగెడుతున్నారు. వివిధ బ్యాంకుల్లో ఏర్పాటు చేసిన, ఆధార్‌సెంటర్ల వద్ద లెక్కకు మించి జనం వస్తుండడంతో సెంటర్ల నిర్వాహకులు చేతులెత్తేస్తున్నారు. కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలో కేవలం ఏడెనిమిది ఆధార్‌సెంటర్లు మాత్రమే ఉండడం, ప్రతిరోజు 30మందికి మాత్రమే అప్‌డేట్ చేస్తుండడంతో ఉదయం ఐదుగంటల ఉంచే క్యూ కడుతున్నారు. అడ్రస్ మార్పు కోసం, పది సంవత్సరాలు పూర్తయిందని, కార్డులో అక్షర దోషాలు ఉన్నాయని బారులు తీరుతున్నారు. ఇక మరోవైపు అప్‌డేట్ చేసుకున్న ఆధార్‌కార్డుతో గ్యాస్ ఆఫీసుల చుట్టు తిరిగి ఫోన్‌నెంబర్‌ను లింకు చేసుకునేందుకు పరుగులు పెడుతున్నారు. దీంతో ఆధార్‌సెంటర్లు, గ్యాస్ ఆఫీస్‌లు ప్రజలతో నిత్యం కిటకిటలాడుతున్నాయి.

పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

బీఆర్ఎస్ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే మెచ్చా పిలుపు

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

ములకలపల్లి, జనవరి 4: అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమితో శ్రేణులు అధైర్యపడకుండా పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. పార్టీ స్థానిక కార్యాలయంలో గురువారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రానున్న ఎన్నికలతో పార్టీకి పూర్వ వైభవం వచ్చేలా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా శ్రమించాలన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సాధారణమేనని అన్నారు. పరాజయంతో ఎవరూ నిరాశ చెందవద్దని, వచ్చేవి మన రోజులేనని ధైర్యం చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం ఈ నెల 9న హైదరాబాద్‌లో ఉంటుందన్నారు. ఎంపీపీ మట్ల నాగమణి, జడ్పీటీసీ సభ్యురాలు సున్నం నాగమణి, పార్టీ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు, నాయకురాలు వగ్గెల పూజ, సర్పంచులు గడ్డం భవాని, బైటి రాజేష్, వాడే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ, ఎస్సీలకు విద్యుత్ సబ్సిడీ

టేకులపల్లి, జనవరి 4: మండలంలోని ఎస్టీ, ఎస్సీ గృహ విద్యుత్ వినియోగదారులకు సబ్సిడీ ఇస్తున్నట్లు ఏఈలు దేవ, బుజ్జి కన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. నెలకు 101 యూనిట్లు, అంతకు లోపు బిల్లు వస్తున్న ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు సబ్సిడీ కోసం తమ కుల-ఆదాయ ధ్రువపత్రాలను విద్యుత్ శాఖ ఏఈకిగానీ, లైన్‌మెన్‌కుగానీ ఇవ్వాలని కోరారు.

19న 'చెకుముకి' సైన్స్ టెస్ట్

దమ్మపేట రూరల్, జనవరి 4: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 19న మండల స్థాయిలో 'చెకుముకి' సైన్స్ టెస్ట్ నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి తిరుపతి రావు తెలిపారు. దమ్మపేటలోని మండల వనరుల కేంద్రంలో ఎంఈవో లక్ష్మితో కలిసి ఈ టెస్ట్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. విజేతలు 27న జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఫిబ్రవరి 3న రాష్ట్ర స్థాయిలో పోటీలు ఉంటాయన్నారు.

రేపటి నుంచి సదరం క్యాంపునకు స్లాట్ బుకింగ్

కొత్తగూడెం అర్బన్, జనవరి 4: దివ్యాంగుల కోసం సదరం ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ విధానాన్ని ఈ నెల 6 నుంచి నిర్వహించనున్నట్లు డీఆర్‌డీవో మధుసూధన్‌రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి నెలకు సంబంధించి క్యాంపు నిర్వహించేందుకు తేదీలను ఖరారు చేసినట్లు చెప్పారు. శారీరకం లోపం ఉన్న వారికి 160 స్లాట్లు, బుద్ధిమాంధ్యం ఉన్న వారికి 80 స్లాట్లు ఉన్నట్లు వివరించారు. ఈ నెల 6, 17, 24, 27 తేదీల్లో క్యాంపులు నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే.. దృష్టిలోపం, వినికిడి లోపం ఉన్న వారికి 60 స్లాట్లు బుక్ చేసుకునే అవకాశం ఉందని, వారికి 10, 31 తేదీల్లో క్యాంపులు ఉంటాయని అన్నారు. సరైన పత్రాలతో హాజరుకావాలని సూచించారు.

మలేరియా నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి

భద్రాచలం, జనవరి 4 : జనవరి నుంచి ప్రతిఒక్కరూ మలేరియా నిర్మూలనకు కృషి చేయాలని మలేరియా అధికారిణి స్పందన అన్నారు. గురువారం ఐటీడీఏ కార్యాలయంలో మలేరియా, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి శిరీష ఆదేశాల మేరకు జిల్లాలోని హెల్త్ అసిస్టెంట్లకు, ల్యాబ్ టెక్నిషియన్లకు నెలవారీ సమీక్ష, ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్లాట్‌ఫారం గురించి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యాధికారులు పాల్గొన్నారు.

'లూయీస్ బ్రెయిలీ జీవితం యువతకు ఆదర్శం'

కొత్తగూడెం అర్బన్, జనవరి 4: లూయీస్ బ్రెయిలీ జీవితం నేటి యువతకు ఆదర్శమని వికలాంగుల జేఏసీ చైర్మన్, టీవీపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు గుండపనేని సతీశ్ పేర్కొన్నారు. లూయీస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా స్థానిక బస్టాండ్ సమీపంలోని టీవీపీఎస్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా లూయీస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బ్రెయిలీ కృషి వల్లనే నేడు అంధులు సైతం అత్యున్నత స్థానాల్లో పనిచేయగలుగుతున్నారని అన్నారు.

డిప్యూటీ సీఎంను కలిసిన టీఆర్‌వీకేఎస్ నాయకులు

డిప్యూటీ సీఎంతో మాట్లాడుతున్న టీఆర్‌వీకేఎస్ నాయకులు

పాల్వంచ, జనవరి 4: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్కను టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కేవీ జాన్సన్, కోడూరి ప్రకాశ్, ఇతర నాయకులు హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో గురువారం కలిశారు. తొలుత డిప్యూటీ సీఎంకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యుత్ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం స్పందిస్తూ ఆయా సమస్యలపై తగు నిర్ణయాలు తీసుకుంటామని అన్నారు. సంఘం నాయకులు చారుగుండ్ల రమేశ్, నిరంజన్, ఎండీ యూసుఫ్, ఎం.దేవేందర్‌రెడ్డి, పీ.రాములు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

పాల్వంచ రూరల్, జనవరి 4: మండలంలోని పూసలతండాలో ఇరువర్గాల మధ్య గురువారం జరిగిన ఘర్షణలో పోలీసులు గురువారం ఐదుగురిపై కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పూసలతండాకు చెందిన పూసల నాగేశ్వరరావు గురువారం తన భార్య నాగమణితో కలిసి వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన నలుగురు పాతకక్షల నేపథ్యంలో ఘర్షణ పడి కర్రతో దాడి చేశారు. దీంతో బానోతు గాంధీ, చందా, స్వరూప, బారీ తదితరులపై నాగేశ్వరరావు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అయితే, నాగేశ్వరరావు కూడా తన పట్ల దురుసుగా వ్యవహరించాడంటూ గాంధీ కూడా ఫిర్యాదు చేశాడు. దీంతో ఇరువర్గాలకు చెందిన ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఎస్సీ, ఎస్టీలు కుల ధ్రువీకరణ పత్రాలను అందజేయాలి'

లక్ష్మీదేవిపల్లి, జనవరి 4: ఎస్సీ, ఎస్టీ గృహ విద్యుత్ వినియోగదారులు తమ కుల ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ కాపీలను విద్యుత్ బిల్లుతోపాటు సంబంధిత ఏఈకి గానీ, లైన్‌మెన్‌కు గానీ అందజేయాలని విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజినీర్ కే.రమేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీలు వారి కుల ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ కాపీలను ఇవ్వడం వల్ల 0-101 యూనిట్లకు ప్రభుత్వం అందించే విద్యుత్ బిల్లు సబ్సిడీ పొందవచ్చునని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేషన్ కార్డులు లేని వారికీ పథకాలు వర్తింపజేయాలి

భద్రాచలం, జనవరి 4 : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభలలో కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకున్న వారికి కొత్త రేషన్ కార్డులతో సహా ఆరు గ్యారెంటీలను వర్తింపజేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు కోరారు. గురువారం పట్టణంలో నిర్వహించిన గ్రామసభలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మండల స్పెషల్ ఆఫీసర్, డిప్యూటీ సీఈవో బీ నాగలక్ష్మిని వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఎలక్ట్రికల్ వర్కర్లకు అండగా ఉంటా..

భద్రాచలం, జనవరి 4 : ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్లకు అండగా ఉంటానని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. గురువారం బీఆర్ఎస్ కార్యాలయంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు చుక్కా సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మీకు ఏ సమస్య వచ్చినా నా దృష్టికి తీసుకు రావాలని కోరారు. కార్యక్రమంలో అరికెల్ల తిరుపతిరావు, రత్నం రమాకాంత్, చింతాడి చిట్టిబాబు, బొంబోతుల రాజీవ్, రత్నం రజనీకాంత్, పెద్దినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు ..

భద్రాచలం, జనవరి 4 : భద్రాద్రి జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం, జనవరి 4 : సీతారామచంద్రస్వామి దివ్యక్షేత్రంలో గురువారం అర్చకులు రామయ్యకు నిత్యకల్యాణం నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్య బలిహరణం, నిత్య హోమాలు నిర్వహించారు.

బేతంపూడి ఉర్సు షరీఫ్ పోస్టర్ ఆవిష్కరణ

టేకులపల్లి, జనవరి 4: మండలంలోని బేతంపూడి దర్గా ఉర్సు షరీఫ్ మహోత్సవాల ప్రచార వాల్ పోస్టర్‌ను నిర్వాహక కమిటీ సభ్యులు గురువారం ఆవిష్కరించారు. బేతంపూడి దర్గాలో జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. హజరత్ సయ్యద్ జమాలుద్దీన్ బీహరిబాబా ఉర్సు షరీఫ్ గంధం ఈ నెల 8వ తేదీ రాత్రి 8.00 గంటలకు చేరుకుంటుందని చెప్పారు.

కోర్టు డైరీ ఆవిష్కరణ

ఇల్లెందు, జనవరి 4: కోర్టు డైరీ, టేబుల్ క్యాలెండర్‌ను ఇల్లెందు బార్ అసోసియేషన్ హాల్లో గురువారం తెలంగాణ హైకోర్టు బార్ కౌన్సిల్ మెంబర్ దూస జనార్దన్ ఆవిష్కరించారు. న్యాయవాదులు మామిడి సత్యప్రకాష్, సత్యనారాయణ, కీర్తి కార్తీక్, సుధాకర్, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

కరకగూడెం, జనవరి 4 : అధికారులు తమ విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని డీహెచ్ఎంవో శిరీష అన్నారు. ఆమె గురువారం కరకగూడెం పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో సిబ్బంది ఎవరూ లేకపోవడంతో సిబ్బంది పట్ల అసహనం వ్యక్తం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మణుగూరు టౌన్, జనవరి 4: మణుగూరు జ్యుడీషియల్ కోర్టులో గురువారం మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు ఏఐఏఎల్‌యూ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

సాయిబాబా ఆలయంలో అన్నదానం

భద్రాచలం, జనవరి 4 : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో వేంచేసి ఉన్న సాయిబాబా ఆలయంలో మాగంటి సూర్యం జ్ఞాపకార్థం వారి కుమారులు మాగంటి ప్రసాద్‌బాబు, మాగంటి రమేశ్‌బాబు గురువారం భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం యాచకులు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.

అప్రమత్తతతోనే అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణ

మణుగూరుటౌన్, జనవరి 4: అటవీశాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండడంతోనే అడవుల్లో అగ్నిప్రమాదాలను నివారించవచ్చునని ఎఫ్‌డీవో మక్సూద్ మోహినుద్దీన్ అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి వచ్చిన స్పెషల్ ట్రైనీస్ మణుగూరులో కల్పిస్తున్న అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. వేసవిలో అడవుల్లో ఎక్కువగా అగ్ని ప్రమాదాలు సంభవించడం జరుగుతుందన్నారు.

దరఖాస్తుల్లో ఆధార్.. రేషన్ కార్డు నంబర్లు ఉండాలి

గ్రామసభల పరిశీలనలో భద్రాద్రి అదనపు కలెక్టర్ రాంబాబు

పాల్వంచ రూరల్/ చుంచుపల్లి/ రామవరం/కొత్తగూడెం అర్బన్, జనవరి 4: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా అభయహస్తం ఆరు గ్యారెంటీ స్కీముల కోసం ప్రజలు అందించే దరఖాస్తులపై ఆధార్, రేషన్ కార్డుల నంబర్లు కచ్చితంగా ఉండేలా అధికారులు చొరవ తీసుకోవాలని భద్రాద్రి అదనపు కలెక్టర్ రాంబాబు, కొత్తగూడెం ఆర్‌డీవో శిరీష, ప్రత్యేక అధికారి సులోచనారాణి సూచించారు. అప్లికేషన్లలో దరఖాస్తుదారుల పుట్టిన తేదీలు, సంతకాలు ఉండేలా చొరవ తీసుకోవాలని అన్నారు. వాటిన్నింటినీ రిజిస్టర్లలో కూడా నమోదు చేయాలని ఆదేశించారు. దరఖాస్తుదారులకు ఏవైనా సందేహాలు ఉంటే హెల్ప్‌డెస్కుల్లో వారికి సమాధానం ఇవ్వాలని సూచించారు. కొత్తగూడెం నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో జరుగుతున్న ప్రజాపాలన గ్రామసభలను గురువారం వారు పరిశీలించారు. దరఖాస్తులు నింపే విధానం, దరఖాస్తుల స్వీకరణ, రిజిస్టర్‌లో నమోదు, సందేహాల నివృత్తి వంటి అంశాలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.

'ప్రజాపాలన'తో పథకాలు చేరువ: ఎమ్మెల్యే కోరం

టేకులపల్లి, జనవరి 4: సంక్షేమ ఫలాలను ప్రజలకు చేరువగా తీసుకెళ్లేందుకే ప్రజాపాలన గ్రామ సభలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నదని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మండలంలోని కోయగూడెం పంచాయతీ కార్యాలయంలో గురువారం జరిగిన గ్రామ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. అర్హులందరికీ పథకాలు అందుతాయన్నారు. బద్దుతండా పంచాయతీ తుమ్మలచెలక గ్రామ సభలోనూ పాల్గొన్నారు. ఎంపీపీ భూక్యా రాధ, సర్పంచులు కోరం ఉమ, భూక్యా చిన్న, ఎంపీటీసీ సభ్యులు జాల సంధ్య, ఊకే రామకృష్ణ, ఎంపీవో గణేష్ గాంధీ, డీటీ ముత్తయ్య, ఏఈ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ఇల్లెందు, జనవరి 4: పట్టణంలోని 13,14,15 వార్డుల్లో గురువారం జరిగిన ప్రజాపాలన సభల్లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కోరం కనకయ్య పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. పథకాలు ఇప్పిస్తామంటూ వచ్చే దళారులను నమ్మి మోసపోవద్దని ప్రజలను కోరారు. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లు, తహసీల్దార్ కోట రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట రూరల్, జనవరి 4: మండలంలోని అంకంపాలెంలో గురువారం జరిగిన గ్రామ సభలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తులకు అధికారులు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలన్నారు. తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీవో నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి, జనవరి 4: మండలంలోని పెద్దిరెడ్డిగూడెం గ్రామ సభను మండల ప్రత్యేకాధికారి అనసూయ గురువారం పరిశీలించారు. ఎంపీడీవో అన్నపూర్ణ పాల్గొన్నారు.

అశ్వారావుపేట టౌన్, జనవరి 4: అశ్వారావుపేట, పేరాయగూడెంలో గురువారం గ్రామ సభలు జరిగాయి. ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, సర్పంచ్ అట్టం రమ్య, తహసీల్దార్ కృష్ణప్రసాద్, ఈవో హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట రూరల్, జనవరి 4: మండలంలోని తిరుమలకుంట, కోయరంగాపురం, గుమ్మడివల్లి గ్రామసభలు గురువారం జరిగాయి. ప్రజాప్రతినిధులు, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీవో సీతారామరాజు, ఏవో నవీన్, ఐబీ ఏఈ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చుంచుపల్లి: గ్రామసభలో దరఖాస్తులు అందిస్తున్న ప్రజలు

టేకులపల్లి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

పాల్వంచ రూరల్‌లో దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆదనపు కలెక్టర్ రాంబాబు

దమ్మపేట రూరల్: అంకంపాలెంలో దరఖాస్తు తీసుకుంటున్న ఎమ్మెల్యే జారే

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616